# బాహ్యమును విస్మరించి భావమును పోషించుకోవాలి

మాను దిద్దగవచ్చు మరి వంపు లేకుండ
దిద్దవచ్చు రాయి తిన్నగాను
మనసు దిద్దగలర మరి వంపు లేకుండ
వినుడు భారతీయ వీరసుతుడ!

విద్యార్థులారా!

మనసు చాలా విచిత్రమైనది, చాలా వేగమైనది, చాలా చంచలమైనది. మహా బలమైనది మనస్సు. ఇక్కడ మనిషి ఉండగా కొన్ని వేలమైళ్ల దూరము పరిగెత్తుతుంది మనసు. ఒక్క క్షణములో వేల మైళ్లు ప్రయాణము చేసి అక్కడ దృశ్యములను చూడగలుగుతుంది. 'చంచలం హి మనః కృష్ణ ప్రమాది బలవదృఢం", అనగా మహా దృఢమైన మనస్సును, మహా చంచలమైన మనస్సును, మహాబలమైన మనస్సును ఏరీతిగా అరికట్టగలము' అని అడిగాడు అర్జునుడు, కృష్ణుని.

ఈ మనస్సుకు రెండు తత్త్వములుంటున్నవి. ఒకటి పశుత్వము. రెండవది మనుష్యత్వము. పశుత్వము, మనుష్యత్వము అనగా ఏమిటో గుర్తించటానికి ప్రయత్నించాలి. కామక్రోధలోభమద మాత్సర్యములనే అరిషడ్వర్గములకు లోనై అనేక వాసనలకు లొంగి తద్వారా కేవలము పశువువలె ప్రవర్తిస్తూ మానవత్వము విస్మరించి పెడమార్గము పట్టి పశువుగా దిగజారిపోతుంది మనసు. రెండవది భగవంతుడు ప్రసాదించిన మతిని, స్థితిని, గతిని, సంపత్తిని సద్వినియోగ పరచుకొని తద్వారా దివ్యత్వమైన మానవత్వము వహించి, తద్వారా దేశమునకు అనేక ఉపకారములు సల్పుతూ వస్తుంది. ఈ మంచి చెడ్డలకు మనసే మూలకారణము. మనసు నందున్న

srisathyasaivachanamrutam

మంచితనము మరొక దానియందు లేదు. మనసునందున్న చెడ్డతనము కూడా మరొకదాని యందు లేదు. ఎంత మంచిదో అంత చెడ్డది.

**సంపర్కముచేత మనసు మంచి, చెడ్డలుగా రూపొందుతుంది**

మనసు చాలా పరిశుద్ధమైనదే. సంఘ దోషమును పురస్కరించుకొని మనస్సు మంచి చెడ్డలుగా రూపొందుతుంది. ఒక న్యూస్ పేపరు ఉంటున్నది. ఈ న్యూస్ పేపరులో మంచి సుగంధమునందించే మల్లెపూలు పొట్లము కట్టినప్పుడు ఈ మల్లెపూల సుగంధము న్యూస్ పేపరుకు అందుతుంది. న్యూస్ పేపరుకు ఈ సుగంధము రావటానికి కారణము ఏమిటి? సుగంథము గల మల్లెపూలను చుట్టపెట్టటం చేత సుగంధమును అందించింది. ఆ న్యూస్ పేపరునందు కొన్ని పకోడాలు పొట్లము కట్టినప్పుడు న్యూస్ పేపరుకు కూడా పకోడా వాసన వస్తుంది. పకోడా సంపర్కముచేత న్యూస్ పేపరుకుకూడా అట్టి వాసనే వచ్చింది. ఈ పేపరుకు స్వతస్సిద్ధమైన వాసన ఏమీ లేదు. ఎట్టి పదార్థమును ఈ న్యూస్ పేపరులో చుడతామో అట్టి పదార్థముయొక్క వాసన పొందుతుంది. అదే విధంగా మనస్సును మంచి మార్గములో ప్రవేశపెట్టి నప్పుడు అది మంచిదిగా రూపొందుతుంది.

ఎట్టిది మంచిమార్గము? సద్భావములు, సచ్చింతలు, సత్ప్రవర్తన, సదాలోచనలు సత్సంగము ఇలాంటి పవిత్రమైన దివ్యమైన భావములచేత ఆధ్యాత్మిక సంబంధమైన వృత్తులచేత, నైతిక భావములచేత, ధార్మిక కర్మలచేత సంపర్కము చెందినప్పుడు ఈ మనస్సు ఎంత మంచిగా రూపొందుతుంది! దుర్గుణముల చేత, దురాలోచనల చేత, దుస్సంగము చేత, దుష్ప్రవర్తన చేత ఇది మహాదుర్గుణముగా మారిపోతుంది. ఒక దుష్టురాలిగా మారిపోతుంది మనస్సు. మనస్సుకు మంచిచెడ్డలు ప్రత్యేకంగా వచ్చేవికావు. ఈ సంపర్కము యొక్క ప్రభావము చేత మనస్సు ఈ విధమైన మంచి చెడ్డలుగా రూపొందుతూ వస్తుంది. మంచి మనస్సు మనం కలిగి ఉండాలంటే మంచి సంఘములో మనం చేరాలి. ఐతే ఒక్కొక్క సమయంలో మంచిచెడ్డగా కనిపిస్తుంది. చెడ్డ మంచిగా కనిపిస్తుంది. ఎవరు మంచివారో ఎవరు చెడ్డవారో తెలుసుకోటం చాలా కష్టము. మంచి సంస్కారం, మంచి నడత, మంచి మాటలు, మంచి ప్రవర్తన మనకు కొంతవరకు గుర్తింప చేస్తాయి మంచివారి క్రింద. కనుక ప్రతి మానవునికి సంస్కారం

sri sathyasai vachanamrutam

అత్యవసరము. అనేక విధములుగా దుర్గుణములను దూరము చేసి సద్గుణములను పోషిస్తూ రావాలి.

**తెలియకపోయినా తెలిసినట్లు నటించేవాడు భక్తుడు, తెలిసీ తెలియనట్లుండేవాడు భగవంతుడు**

ఒకానొక సమయములో షిరిడీలో బాబా కూర్చొని ఫక్కున నవ్వుతున్నాడు. ఎవరికి ఏమీ అర్థము కాలేదు. కొంతమంది పిచ్చివాడని తలుస్తుంటారు, కొంతమంది ఇతనొక బైరాగియని భావిస్తుంటారు. కొంతమంది ఫకీరు అని విశ్వసిస్తూ ఉంటారు. పిచ్చివాడనుకున్నవారికి పిచ్చివాడుగానే కనిపిస్తాడు. ఫకీరు అనుకునే వారికి ఫకీరుగానే కనిపిస్తాడు. బాబా నవ్వుతూ నవ్వుతూ 'ఒరేయ్ కులకర్ణి ఆవ్" అన్నాడు. అక్కడ ఒక కులకర్ణి ఉండేవాడు. అతని పూర్తిపేరు అప్పాకులకర్ణి. 'ఏమిటి బాబా' అని అడిగాడు. తన జేబులోనుండి రెండు కాసులు తీసి ఇచ్చి, నీవు జల్గాం వెళ్లి అక్కడ నానా ఉంటాడు తీసుకొనిరా' అన్నాడు. ఈ నానా తహసీల్దారుగా పనిచేస్తూ ఉండేవాడు. ఆనాటి పరిస్థితిలో తహసీల్దారు అంటే చాలా గౌరవింపతగిన ఉద్యోగము. రెవెన్యూ సంబంధమైనవన్నీ తహసీల్దారు దగ్గరకే పోయేవి. ఇంతేకాకుండా, పదవితోబాటు సంస్కృతముకూడా నేర్చినవాడు, నానా. గొప్ప విద్యావంతుడు. మంచి పదవిలో ఉన్నాడు. గొప్ప పర్సనాలిటీ. ఈ మూడింటిని పురస్కరించుకొని అహంకారం కూడా అధికమైపోయింది. ఈ కులకర్ణి వెళ్లిన తక్షణమే 'ఎందుకోసం వచ్చావు'? అన్నాడు. 'బాబా నిన్ను తీసుకొని రమ్మన్నాడు' అన్నాడు. 'ఛీ వెళ్లు నీకు బుద్ధిలేదా. ఎవరో ఎక్కడో ఒక ఫకీరుంటే వాని దగ్గరకు నేను పోవాలా? నేను తహసీల్దారును. గొప్పవాడను, విద్యావంతుడను, నన్ను వాని దగ్గరకు పొమ్మంటున్నావా? వెళ్లో'మన్నాడు. ఈ వార్త బాబాకు చెబితే తిరిగివెళ్ళి తీసుకురమ్మని చెప్పాడు. అనేక పర్యాయములు 'నేను నానాను చూడాలి, నానాను చూడాలి' అని ఒక పిచ్చివానివలె అరుస్తున్నాడు, బాబా. ఈ కులకర్ణి 'ఏమిటిది! నన్నుకూడా అవమానపరుస్తున్నాడు ఈ నానా. ఇంత అహంకారియైన నానాను చూడడంలో బాబాకు గల ఆప్యాయత ఏమిటి?' అని అనుకున్నాడు. కడపటికి ఈ కులకర్ణి పోయి, నానా కాళ్లు పట్టుకుని 'బాబా నిన్ను చూడాలని ఆశిస్తున్నాడు. తప్పక నీవు రావాల'ని గట్టిగా ఏడ్చాడు. అప్పుడు చెప్పాడు నానా: "నీకోసమై నేను వస్తున్నాను. కానీ

srisathyasaivachanamrutam

బాబాను చూడటానికి రావటం లేదు. అతనికి నాకు ఏవిధమైన పోలికలు లేవు. అతనిని చూడనక్కరలేదు' అన్నాడు. 'నా ప్రార్థన మన్నించి మీరు తప్పక రావాలి', అని కులకర్ణి కోరాడు. నానా షిరిడీ వచ్చాడు. బాబాకు నమస్కారంకూడా చేయలేదు. 'ఎందుకండి పిలిపించారు? మీకు, నాకు ఏమి సంబంధము? నేను పెద్ద అధికారిని. మీరు ఫకీరు. నాతో మీకేమి పని, మీతో నాకేమి పని?' అని అడిగాడు. దగ్గరకు వచ్చాడు బాబా. 'బైఠో, ఉద్రేకము మంచిదికాదు. అహంకారము మంచిదికాదు. నీ అహంకారము వలన నాకేమీ నష్టంలేదు. నీ అహంకారము నీకే నష్టము. కూర్చో నేను చెబుతాను', అన్నాడు. నానా కూర్చున్నాడు. 'ప్రస్తుత పరిస్థితిలో నీకు, నాకు ఎట్టి సంబంధము లేదు. కానీ పోయిన జన్మలో నీకు నాకు చాలా సన్నిహిత సంబంధము ఉంది. ఆ విధమైన సంబంధ బాంధవ్యము ఉండటం చేత, నిన్ను చూడాలని ఆశించాను' అని చెప్పాడు. అప్పుడు నానాకు మరింత కోపం వచ్చింది. 'ఏమిటి present పరిస్థితిలోనే ఏమీ సంబంధం లేనప్పుడు ఎప్పుడో past నాకు, మీకు ఏమి సంబంధం ఉంది? తెలియని కాలగర్భంలో కలసిపోయింది. ఇలాంటి విషయాలలో నాకు నమ్మకము లేద'న్నాడు. బాబా లేచి దగ్గరకు వచ్చి తన హస్తమును నానా కన్నులపైన పెట్టాడు. కన్నులు తెరిచాడు నానా. Past life చరిత్ర కన్పించింది. 'ఇది నా భ్రమ. దీనిని నేను నమ్మను. నా past నాకు కనిపిస్తున్నది. నీ past నాకు కన్పించాలి కదా?' అనుకున్నాడు. తిరిగి బాబా తన కన్నులు ముట్టుకొని తిరిగి నానా కన్నులు ముట్టుకున్నాడు. 'బాబా పూర్వం ఎవరో నానా పూర్వం ఎవరో' ఈ రెండు కూడా కన్పించాయి నానాకు. సాష్టాంగ నమస్కారము చేశాడు. 'బాబా! తెలియక మేము చాలా మూర్ఖత్వాన్ని పొందుతాము. తెలియనప్పుడు తెలియనివానిలా ఉండము. తెల్సినవానిగా మేము నటిస్తాము. మీకు తెలిసికూడా తెలియనివారిలా ఉంటారు. ఇదే భేదము భగవంతునికి, భక్తునకు. తెలియక పోయినా తెలిసినట్లు నటించేవాడు భక్తుడు. తెలిసికూడా తెలియనివాడుగా ప్రవర్తించేవాడు భగవంతుడు. ఏమీ తెలియనివాడులా ఉంటాడు అన్నీ చేస్తాడు. ఏమీ చేయనివానిలా ఉంటాడు. అన్నింటిని ఆకర్షిస్తాడు. ఏమీ ఆకర్షించని వానిలా ఉంటాడు. ఇదే దైవత్వమునకు, జీవత్వమునకు ఉన్న భేదము.

**మానుషాకారము లేక మనుష్యులను సమీపించుటకు వీలుకాదు**

sri sathyasaivachanamrutam

ఇవన్నీ మనకు అవగతం కావాలంటే నిశ్చలమైన మనస్సు, నిర్మలమైన భావము, చలించని మనస్సును, భ్రమించని దృష్టిని మనం అభివృద్ధి గావించుకోవాలి. ఎలాంటి పరిస్థితియందు సందేహమునకు అవకాశము ఇవ్వకూడదు. దానికేమాత్రము లొంగకూడదు. ఆ doubts కు మనం కృంగకూడదు. అనుగ్రహమునకు పొంగకూడదు. పొంగి, కృంగని సమత్వము వహించుటకు తగిన కృషి చేయాలి. ఇది పరిపూర్ణమైన విశ్వాసమునందు మాత్రమే ప్రాప్తిస్తుంది. దివ్యత్వము ఒక ప్రత్యేక రూపము ధరించిరాదు. మానుషాకారము ధరించి మాత్రమే వస్తుంది. 'దైవం మానుషరూపేణా'. మానుషాకారము లేక మనుష్యులను సమీపించుటకు వీలుకాదు. పురందర దాసు చెప్పాడు: 'రాతి నాగును చూచి కండచక్కెర పెట్టి అనేక ప్రదక్షిణలు చేసి నమస్కరిస్తుంటారు. కానీ అదే నాగుపాము ప్రత్యక్షమైనప్పుడు రాళ్ళతో కొట్టి హింసిస్తున్నారు'. భగవంతుడు సామీప్యాన్నీ, సారూప్యాన్నీ, సాయుజ్యమును అనుగ్రహించటానికి మానుష రూపము ధరిస్తాడు. మనిషికి మనిషి సమీపముగా ఉండటానికి అవకాశముంది. మనిషిని మనిషి అర్థము చేసుకోటానికి తెలివి తేటలుంటాయి. మానవుని మనస్సు పరిమితముగా ఉంటుంది. ఇది below senses. భగవత్తత్త్వము beyond senses. మానవునితో సన్నిహితము పెంచుకోటానికి, స్నేహము పెంచుకోటానికి, సమీపత్వము కావటానికి, సంభాషణలు సల్పటానికి, సాక్షాత్కారము ఇవ్వటానికి మనుష్యత్వమే ప్రధానమైనది. అట్లు కాకుండా నేను భగవంతుడనని శంఖు చక్ర గదాధారిగా వస్తే భక్తుడు పరుగెత్తిపోతాడు. ఇవన్నీ అసహజమైనవి. సహజమునకు సహజమే కావాలి. అందువలన భగవంతుడు మానవాకారము ధరించి మానవాకారములో నున్న భగవత్ తత్త్వమును అభివృద్ధి పరుస్తాడు.

**అవతరణ అనగా భగవంతుడు దివ్యమైన స్థాయినుండి మానవుని స్థాయికి రావటం**

రావటం అంటే పైనుంచి క్రిందకు దిగటం కాదు. దివ్యమైన స్థాయి నుండి మానవ స్థాయికి రావటం. నీ స్థాయికి వచ్చినంత మాత్రమున భగవత్ తత్త్వమును ఏమాత్రము కించ పరచటానికి వీలుకాదు. నేలపైనున్న పిల్లను తల్లి ఎత్తుకోవాలంటే తల్లివంగి ఆ బిడ్డను చేతులలో ఎత్తుకుంటుంది. తల్లి వంగినంత మాత్రమున బిడ్డకు లొంగినట్లుకాదు. అదేవిధముగా భక్తులను ఉద్ధరించాలని, భక్తుల క్షేమాన్ని గుర్తించాలని భగవంతుడు వస్తుంటాడు. ఈ భక్తోద్ధారణ నిమిత్తమై

sri sathyasai vachanamrutam

వారి స్థాయికి దిగుతుంటాడు. ఈ దిగినంత మాత్రమున మానవుడు భ్రమిస్తుంటాడు, 'దైవమంటే ఇట్లా ఉంటాడా' అని. సామాన్య మానవునిగా సంచరిస్తున్నాడు, సామాన్య మానవునిగా పలకరిస్తున్నాడు, ఇదంతా దైవమునకు తగిన స్థాయి కాదే, అతీతమైనదిగా ఉండాలని భావిస్తాడు. మానవాకారములో నున్న తత్త్వమునే మీరు అర్థము చేసుకోలేనప్పుడు మానవాతీతమైన తత్వాన్ని మీరు ఏరీతిగా అర్థము చేసుకోగలరు? అసాధ్యము. కనుక మీరైనా ఆ స్థాయికి రావాలి. దైవమైనా మీ స్థాయికి రావాలి. అప్పుడే సన్నిహిత సంబంధ బాంధవ్యము గుర్తించటానికి వీలవుతుంది. దైవము సామాన్య మానవుని వలె సంచరించిన మాత్రమున దైవముగా భావించుకోకుండా ఉండకూడదు.

సర్వులు దైవస్వరూపులే. ఆకారములు వేరువేరుగా ఉన్నాయిగానీ ఆత్మతత్వము ఒక్కటే. ఈ విధమైన సత్యతత్వము గుర్తించటానికి మొట్టమొదట ప్రయత్నించాలి. అనేక జన్మల సంస్కారము ఒక్క జన్మలో పరిహారము గావిస్తుంది. ఏ జన్మములో ఎవరు ఏవిధమైన రూపనామములను ధరించారో ఆ నామ రూపములను వారికి నిరూపించినా నమ్మలేక పోతుంటారు. కారణం ఏమిటి? ఆ జన్మములో ఆ రూపములో నున్నారు. ఆ జన్మము మరచిపోయారు వీరు. రెండూ తెలిసినా ఒక్కొక్కసారి విశ్వసించలేకపోతుంటారు. ఒక చిన్న ఉదాహరణ: నీకు తెలుగు, ఇంగ్లీషు రెండు భాషలూ తెలుసు. కానీ, తెలుగు మాట్లాడే సమయంలో ఇంగ్లీషు పదాలు రావు. ఇంగ్లీషు పదాలు రాకుండా పోయినంతమాత్రమున ఇంగ్లీషు రాదనా అర్థం? ఇప్పుడు అనిల్‌కుమార్ ఇంగ్లీషులో ట్రాన్స్‌లేషన్ చేస్తున్నాడు. ఇంగ్లీషులోకి తర్జుమా చేయాలంటే తెలుగు తెలుసుండాలి కదా! అతనికి తెలుగు తెలుసు. కానీ ట్రాన్స్‌లేషన్‌లో ఇంగ్లీషు మాత్రమే ఉపయోగపెడుతున్నాడు. అదేవిధముగా past life తెలుసు; present life తెలుసు. కానీ, present life మీద concentrate చేయటం వలన past life మరచిపోతుంటారు. తిరిగి దాన్ని దర్శించినప్పుడు అది గుర్తు వస్తుంది. Past is past, forget the past. Future is not sure, don't brood over the future. Present is very important. This is not ordinary present but omnipresent. దీనిని మొట్టమొదట గుర్తించాలి. ఇది ఎట్లా omnipresent అయ్యింది? Past results present లో ఉంటున్నాయి. Future results కూడా present లో

ఉంటున్నాయి. ఉదయం ఏమి తిన్నామో అదే ఇప్పుడు త్రేపు వస్తుంది. ఇప్పుడు ఏమి తింటామో future లో అదే త్రేపు వస్తుంది. Past - వృక్షము, future - వృక్షము, present - విత్తనము. విత్తనము లేక వృక్షము లేదు. Past వృక్షమునకు, future వృక్షమునకు present అనే విత్తనమే మూలకారణము.

దీనిని పురస్కరించుకొనియే భగవద్గీతయందు 'బీజం మాం సర్వ భూతానాం' అని శ్రీ కృష్ణుడు చెప్పాడు. ఈ దివ్యత్వమునకు జన్మమే లేదు. అన్నీ జన్మములే. అన్ని రూపములు తనవే. నిన్న చెప్పాను లక్ష్మీబాయి చపాతీలు తీసుకువచ్చినప్పుడు కుక్కతింటే నేనే తిన్నాను అన్నాడు బాబా. భగవంతునికి అధికము, హీనము అనే భేదము లేదు. ఆకారములు వేరు రూపనామములు వేరుగా ఉన్నా, దైవత్వము ఒక్కటే. అదే ఏకాత్మభావము. మనస్సు ఒక్కటే, అనేక రూపములు ధరిస్తుంది. దీనికి కారణం ఏమిటి? అనేక సంకల్పముల చేరిక చేతనే రూపములు తాను మార్చుకుంటుంది. ఏఏ రూపములు ధరిస్తుందో ఆయా రూపమునకు తగినట్లు నటన చేయవలసివస్తుంది. రూపము వేరు, యాక్షన్ వేరు వీలుకాదు. పూర్వము నాగయ్య అని గొప్ప యాక్టర్ ఉండేవాడు. ఈ నాగయ్య, త్యాగయ్య వేషము వేశాడు. ఈ త్యాగయ్య వేషము వేసినప్పుడు త్యాగయ్య వలె నటించాలి గానీ త్యాగయ్య వేషము వేసి నాగయ్యవలె నటిస్తే రాళ్లు పడతాయి. స్టేజిపై త్యాగయ్య, స్టేజి వెనుక నాగయ్య. ఈ ప్రకృతి దృష్టిలో మీరు ప్రత్యేకమైన వారే. ప్రకృతికి అతీతమైపోతే మీరు, నేను ఒక్కటే.

**నీవు చూచేదంతా దైవమే!**

మంచి, చెడ్డలకు మూలకారణం మనసే! 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అన్నారు. అనేక సమయములలో పిల్లలకు చెప్పాను. ఒక lock and key ఉంటున్నవి. Key తీసుకొని lock లో పెట్టి right side కి turn చేస్తే open అవుతుంది. Left side కి turn చేస్తే lock అవుతుంది. ఒకే lock, ఒకే key. కానీ turn చేయటం వేరు. మన హృదయమే lock, మన మనస్సే key. హృదయములో మనస్సు పెట్టి దైవమువైపు తిప్పినప్పుడు detachment. మనస్సు హృదయంలో పెట్టి జగత్తువైపు తిప్పితే attachment. నీ కన్నులు ఒక్కటే జగద్భావముతో చూచినప్పుడు ఇది ప్రకృతిగా

మారిపోతున్నది. ప్రకృతిని దైవభావముతో చూచినప్పుడు ఇదే దైవముగా రూపొందుతుంది. పిచ్చివాడా! దైవమును చూడాలని ఆశిస్తున్నావు. నీవు చూస్తున్నావు దైవమును. చూచేదంతా దైవమే. శిరస్సులన్నీ విరాట్‌స్వరూపమే. ప్రతి పదార్థము దైవ స్వరూపమే. ప్రతి వ్యక్తి దైవ స్వరూపమే. ప్రతి విషయము దైవ స్వరూపమే. దైవస్వరూపము చూస్తూ నేను దైవమును చూడాలనుకోటం ఎంత సంకుచిత మనస్సు నీది! దైవమంటే ఎట్లా ఉంటాడని నీవు అనుకున్నావు? ఏ దానిని చూస్తే దైవమని విశ్వసిస్తావు? దైవమంటే ఎట్లా ఉంటాడో నీకే తెలియదు. అలాంటప్పుడు నీవు దేనిని చూచి దైవమని విశ్వసిస్తావు. అదే మూర్ఖత్వము. సర్వము దైవత్వమే. ఆ దైవ విశ్వాసము గాఢంగా పెట్టుకొన్నప్పుడు దీనికి మించిన విశ్వాసము మరొకటి లేదు.

ఒకానొక సమయంలో పరీక్షిత్తు మహారాజు శుకుని ప్రశ్నిస్తున్నాడు. ఏడు దినములలో తన జీవితము గతిస్తుంది. అది ఋషి శాపము. ఈ ఏడు దినముల కాలము ఎందుకు వ్యర్థము చేయాలి? దైవ చింతనతో సార్థకము గావించుకుంటానని శుకమహర్షిని పిలిపించుకొని అనేక బోధలు వింటున్నాడు. శుకుడు బ్రహ్మచారి. అలాంటివాడు గోపికల తత్త్వము చక్కగా వర్ణిస్తూ వచ్చాడు. పరీక్షిత్తుకు సందేహము కలిగింది. 'స్వామీ! గోపికలు ఏ విద్యలూ తెలియనివారు. ఎట్టి సాధనలూ చేయనివారు, ఎట్టి వేదశాస్త్ర ఇతిహాస పురాణములూ వారికి తెలియవు. ఇలాంటి గోపికలకు భగవంతుడు ఏవిధముగా వశమైపోయాడు?' అని అడిగాడు. 'పిచ్చివాడా! వేదశాస్త్ర ఇతిహాస పురాణములు తెలిసినంత మాత్రమున దైవాన్ని చూడగలుగుతున్నారా అందరు? వేదశాస్త్ర ఇతిహాస పురాణములు భగవంతుని వర్ణించటమేగాని, దర్శించుటకు హృదయ పవిత్రత ఉండాలి. శాస్త్రములు చదివిన ప్రాపంచిక సంబంధమైన జ్ఞానము లభించవచ్చు. ఇది ప్రాకృత జ్ఞానమే గానీ దివ్యజ్ఞానము కాదు. దివ్యజ్ఞానము కావాలంటే ఈ శాస్త్రము కాదు ప్రధానము. ఈ శాస్త్రము మానసిక తత్త్వమును మారుస్తుంది. రామాయణము పెట్టుకొని ఒక పిల్లవాడు పేజీపేజీ తిప్పుతున్నాడు. అదేరీతిగా ఒక పండితుడు ఒక్కొక్క పేజీ తిప్పుతున్నాడు. ఇతను గొప్ప పండితుడు, పిల్లవాడు అజ్ఞాని. కానీ పేజీలు తిప్పటం ఒకటే. పిల్లవాడు బొమ్మలు చూస్తున్నాడు. పండితుడు విషయము చూస్తున్నాడు. ఇదే వ్యత్యాసము.

**మనిషి మనిషిగా ప్రవర్తిస్తే ప్రపంచమంతా మంచిగా ఉంటుంది**

sri sathyasaivacahamrutam

ఒకానొక ఆఫీసరు ఆఫీసులో ఉన్నాడు. ఇంటిలో పిల్లవాడు రోదన చేస్తుంటే భార్య పంపించింది, తండ్రి దగ్గర పోయి కూర్చోమని. తండ్రి ఆఫీసులో ఉన్నాడు. పిల్లవాడు అక్కడ కూడా పేపర్లు లాగి అల్లరి చేస్తున్నాడు. పక్కన మ్యాప్ ఉంది. మ్యాప్‌ను ఇచ్చి కత్తిరించి, సరిచేయమన్నాడు పనిపెట్టాలని. వరల్డ్ మ్యాప్‌లో ఏదేశము ఎక్కడుంటుందో తెలియదు. తిప్పి చూచాడు వెనుక ఒక మనిషి బొమ్మ ఉంటున్నది. సులభంగా మనిషిని అర్థము చేసుకున్నాడు. చేతులు ఎక్కడ ఉండాలి తల ఎక్కడుండాలి. కత్తిరించిన పేపరంతా కూర్చుతూ వచ్చాడు. మనిషిని కూర్చేటప్పటికి తిప్పి చూస్తే వరల్డ్ మ్యాప్‌గా వచ్చేసింది. తనకు తెలియని వరల్డ్ మ్యాప్ కరెక్ట్‌గా వచ్చింది. ఎందుకు కరెక్ట్‌గా వచ్చింది? మనిషి కరెక్ట్‌గా వచ్చేటప్పటికి వరల్డ్ మ్యాప్ కరెక్ట్‌గా వచ్చింది. మొట్టమొదట మనిషి మనిషిగా మారితే ప్రపంచమంతా మంచిగా ఉంటుంది. మొట్టమొదట మనిషి మనిషిగా మారాలి. మనిషి మనిషిగా ప్రవర్తించాలి. మనిషి మనిషిగా జీవించాలి. ఇదే మాధవత్వము. మనిషికూడా పశువుగా మారిపోతే ఇంక ఏవిధంగా ప్రపంచము చూడగలరు? ఇది అసాధ్యము. మొట్టమొదట నీవు మనిషిగా జీవించు. పశువుగా దిగజారవద్దు. రాక్షసుడుగా రూపొందవద్దు. మనిషి మనీషిగా బ్రతకాలి. అదే చాలు. అదే నీ దివ్యత్వమునకు మార్గము.

ఈనాడు మానవుడు మానవుడుగా కావటానికి, పశువుగా మారటానికి, మాధవుడుగా రూపొందటానికి మనసే కారణము. మానవత్వము ప్రత్యేకంగా లేదు. పశుత్వము ప్రత్యేకంగా లేదు. దివ్యత్వము ప్రత్యేకంగా లేదు. మూడింటి ఏకత్వమే మానవత్వము. ప్రేమతత్త్వముతో, దయాకరుణలతో జీవించినప్పుడు నీవే దైవముగా మారిపోతావు.  నీవు ఇంద్రియలోలుడై ఇంద్రియములకు స్వాధీనమై వాటి చెప్పుచేతలలో బ్రతుకుతుంటే  రాక్షసుడుగా మారిపోతావు. క్షణములో కోపము రావటము, క్షణములో ఉద్రేకము రావటము అన్నీ క్షణాలలోనే రూపొందుతుంటాయి. ఇది రజోగుణలక్షణము. మంచిని చెడ్డగా, చెడ్డను మంచిగా మార్పు చేసేది తమోగుణ లక్షణము. మానవుడు త్రిగుణాత్మక స్వరూపుడు. ప్రపంచముకూడా త్రిగుణాత్మకమైన స్వరూపమే. త్రిగుణాత్మకమైన ప్రపంచములో త్రిగుణాత్మకుడైన మానవుడుగా రూపొందాలి. త్రిగుణాత్మక మానవుడు త్రిగుణాతీతంగా మారిపోవాలి. అప్పుడే బ్రహ్మానందము ప్రాప్తిస్తుంది. భగవదాజ్ఞను శిరసా వహించు. భగవంతుని ఆజ్ఞను మనం పాటించాలి. భగవంతుని

sri sathyasai vachanamrutam

ఇష్టమును మనం అర్థం చేసుకోవాలి. దైవత్వము అందరియందు ఉండినప్పటికి రూపనామముతో నాకు సాక్షాత్కరించింది అనే సద్భావము కలగాలి. రెండు దేహములు ఒక్కటే అనే భావము పెట్టుకుంటే ఏమాత్రము సాధ్యము కాదు. దేహములు సమానమే. కాని భావములు మాత్రం ప్రత్యేకము. భగవంతుడు భావప్రియుడుగానీ బాహ్యప్రియుడు కాదు. మానవుడు బాహ్యప్రియుడేగానీ భావప్రియుడు కాదు. బాహ్యమును విస్మరించి భావమును పోషించుకోటానికి కృషి చేయాలి.

అవే ఆనాడు నానాకు కల్గిన డౌట్స్. అలాంటి నానా కట్టకడపటికి ఒక్క క్షణమైనా బాబాను వదలలేకపోయేవాడు. బాబా హుక్కా పీల్చాలనుకుంటే ముందు నానా పీల్చి బాబాకు అందించాలి. అంత సన్నిహితుడుగా మారిపోయాడు నానా. నానాలేక బాబా భోజనము చేసేవాడు కాదు. బాబా లేక నానా భోజనము చేసేవాడు కాదు. అట్టి సంబంధ బాంధవ్యము ఏర్పడిపోయింది. కానీ అది సామాన్యమానవులు అర్థము చేసుకోలేరు. 'ఆయన లేక ఈయన ఎందుకు భోజనం చేయకూడదని' కొంతవరకు విమర్శిస్తారు. 'అది నా ఇష్టము నీవెవరు చెప్పేందుకు. నా భావము అట్లుంది. నానా ఉంటేనే భోజనము చేస్తాను,' అనుకున్నాడు బాబా. ఇంత దయామయుడుగా ఉంటున్నాడు దైవము 100%compassion 100%love . దీనికంటె మించినది మరొకటి లేదు. ఈ ప్రేమ తత్త్వమును అందరు చక్కగా అర్థము చేసుకోవాలి. ఈ ప్రేమయే సర్వులయందు ఉన్నది. కాబట్టి సర్వులను ప్రేమించండి. ఎవరిని ద్వేషించకూడదు. కారణం ఏమిటి? మనము ఎవరినైనా ద్వేషిస్తే వారు మనలను ద్వేషిస్తారు. Reaction resound and reflection. దైవత్వములో మూడూ ప్రతిబింబిస్తూ ఉంటాయి. ఎవరి జన్మము ఏనాడు ఎట్టిదిగా ఉండేదో ఈనాడు ఈ జన్మము ఏరీతిగా ఉంటుందో ఎవరు చెప్పలేరు. అలాంటి వారికే ఎట్టి కారణము లేకుండా కార్యము జరుగుతుంది. వారు ఆశించకపోయినా భగవంతుడే వారిని ఆశించి వారిని లాగుతూ ఉంటాడు. కారణం ఏమిటి? Past life యొక్క ప్రాప్తియే మూలకారణము. పూర్వపు విత్తనమే ఈనాడు మొక్కగా వస్తుంది. విత్తనము లేక మొక్క ఎట్లా వస్తుంది. ఒక దినము సాయంకాలము బీచ్‌లో తిరుగుతుంటే అంతా ఇసుకయే కనిపించింది. రెండవ దినము వర్షము కురిసింది. మరుసటి దినము బీచ్‌కి పోయి చూస్తే పచ్చగా మొలకలు వచ్చాయి. నిన్న ఏ మొక్కలు లేవు. ఈనాడు పచ్చగా



sri sathyasai vachanamrutam

కనిపిస్తున్నాదంటే నిన్నటి దినము కూడా ఉంటున్నది. నిన్న విత్తన రూపములో ఉంటున్నది. ఈనాడు మొక్క రూపములో కనిపిస్తున్నది. నిన్న విత్తనము లేక ఈనాడు మొక్క రావటానికి వీలు కాదు. ఈ విత్తనము కనిపించదు. మొక్క కనిపిస్తుంది. కనిపించనిదే మీకు వినిపిస్తుంది. వినిపించినదే తలపిస్తుంది. తలపించినదే మురిపిస్తుంది. మురిపించినదే మరపిస్తుంది. మనకు కనిపించనిది మురిపిస్తున్నది.

**మంచిగా మాట్లాడండి మంచిగా ప్రవర్తించండి; మంచిపేరు తెచ్చుకోండి!**

నీవు past life గురించి ఏమాత్రము విచారించవద్దు. సమయం వస్తే రెండు ఏకమైపోతాయి. దైవం కోసం వేచి ఉండు. Don't waste time, time waste is life waste. ఒక్కొక్కదానికి ఒక్కొక్క సంబంధము ఉంటుంది. ఈ సంబంధ బాంధవ్యములు ఒకరు చెబితే వచ్చేవి కాదు. అది దైవత్వమునకు తప్ప మరొక దానికి వీలుకాదు. Free will అంటారు యువకులు. ఏమిటి అర్థము, ఎవరికుంది ఈ freewill ? ఎవరికీ లేదే! నేను ఏదో ఒక పని చేయాలి కనుక free will అంటారు. తక్షణమే సందేహాలు వస్తాయి అవుతుందో కాదోనని. ఇంక free will ఎక్కడుంది? ఆ యోచనకే అవకాశము ఉండకూడదు. ఆ free-will divine power తప్ప మరొకటి కాదు. ఎవరికీ free will లేదు. ప్రపంచమునకు ప్రెసిడెంటు కావచ్చు. ఏపని చేయాలన్నా కొన్ని నిబంధనలకు కట్టుబడి ఉండాలి. కానీ దైవమునకు ఎట్టి కట్టుబాటు లేదు, ఏమైనా చేయవచ్చు. అది free will. ఆ పదములు ఉపయోగపెట్టకూడదు. ఒక్క దైవత్వమునకు మాత్రమే free will. అదే నిజమైన శక్తి. మానవుడు మానవుడుగా జీవించటానికి ప్రయత్నించాలి. తోటి మానవునితో మానవుని వలె ప్రవర్తించాలి. మానవుల మధ్యలో మృగమువలె నీవు ప్రవర్తించవద్దు. ఎవరికైనా నమస్కారమంటే వారు నమస్కారమంటారు. ఎలాంటి భావముతో పలకరిస్తామో అలాంటి భావముతో ఎదురు పలుకు వస్తుంది. మంచిగా మాట్లాడండి. మంచిగా ప్రవర్తించండి. మంచిగా నడచుకోండి. మంచి పేరు తెచ్చుకోండి. ఆదర్శవ్యక్తులుగా మీరు తయారు కావాలి. వ్యక్తిత్వము పోషించుకోటానికి పూనుకోవాలి. అప్పుడే మన జీవితము జై అనిపించుకుంటుంది.

1996 జూన్ 24వ తేది సాయికుల్వంత్‌హాల్‌లో భగవాన్ దివ్యోపన్యాసం

sri sathyasai vachanamrutam